క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మంచి వైపు పయనించాలి



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ చెడును తొల గించి, మంచి మార్గం వైపు పయనించాలని ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విద్యాలయం సేవ కేంద్రం నిర్వాహకురాలు ఉమా రాజేశ్వరి అన్నారు. దేవాపురం రెండో వీధిలోని విద్యాలయంలో బ్రహ్మ కుమారీస్ సంస్థ స్థాపకులు ప్రజాపిత బ్రహ్మ అవ్యక్త స్మృతి దివస్‌ను శనివారం విశ్వశాంతి దినోత్సవంగా నిర్వహించారు. తొలుత బ్రహ్మకుమారి శిరీష రాజయోగ అభ్యాసం చేశారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం

లక్ష్మీపురం: బాలానందన్ స్ఫూర్తితో కార్మిక హక్కులు కాపాడుకునేందుకు పోరాడాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఇ.బాలానందన్ శతజయంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. తొలుత కార్మిక సంఘం నాయకుడు ఇ.బాలానందన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన శతజయంతిని జూన్ 16, 2025 వరకు దేశవ్యాప్తంగా జరపాలని సీఐటీయూ ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ పిలుపునిచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

నేడు క్లబ్‌ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ప్రమాణస్వీకారం

నగరంపాలెం: వాసవి క్లబ్ గుంటూరు, వాసవి క్లబ్ మహిళా, వాసవి క్లబ్ యువ 2025 సంవత్సరానికి ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, బి.ఓ.డి సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించనున్నట్లు వాసవి క్లబ్ గుంటూరు అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం జరుగుతుందని చెప్పారు. పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు యాదా నాగేశ్వరరావు, క్రేన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ జి.వి.ఎస్. ఎల్.కాంతారావు హాజరవుతారని పేర్కొన్నారు.

తెలుగు పద్యాలపై ఉచిత శిక్షణ



నగరంపాలెం: బ్రాడీపేట సీపీఎం కార్యాలయ ఆవరణలో శనివారం తెలుగు కావ్య మథనం (పూసపాటి పద్య పాఠశాల) ద్వితీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సభకు సమూహ వ్యవస్థాపకుడు పూసపాటి కృష్ణసూర్యకుమార్ అధ్యక్షత వహించారు. వాట్సప్ మాధ్యమం ద్వారా తెలుగు పద్యాలు ఉచితంగా శిక్షణ పొందగా, పదమూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రావి రంగారావు, ఆత్మీయ అతిథులుగా సూర్యదేవర రవి కుమార్, కంది శంకరయ్య ప్రసంగించారు. పూసపాటి చేపట్టిన సినిమా క్విజ్ అందరిని ఆకట్టుకుంది. ఐదుగురు విద్యార్థులకు అవార్డులు అందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లక్ష్మీపురం: నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్న వాహనాన్ని పట్టాభిపురం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలాగనర్ రైల్వే గేటు వద్ద పట్టాభిపురం పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ఎస్టీ కాలనీకి చెందిన మేడా నాగేశ్వరరావు ఓ ఆటోలో సుమారు 800 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నాడు. గమనించిన పోలీసులు అదుపులో తీసుకుని ఆటోను, మేడా నాగేశ్వరరావును స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సివిల్ సప్‌లై డెప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ ఖాదర్ బేగ్ పరిశీలించి, బియ్యంగా ధ్రువీకరించి బియ్యాన్ని సీజ్ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రమదోపిడీకి కార్పొరేట్ల కుట్ర

లక్ష్మీపురం: వారానికి 90 గంటలు పని గంటలు ఉండాలంటే ఎల్ అండ్ టీ అధిపతి ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైన వని, కృత్రిమ మేధ బూచిగా చూపించు ఉద్యోగ, శ్రామికులను లొంగదీసుకునేందుకు కార్పొరేట్లు ప్రారంభించిన కుట్ర ఇది అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

వెన్నుదన్ను కీలకం

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- పెరుగుతున్న స్పయిన్ సమస్యల బాధితులు
- వెన్నుముక సమస్యల బారినపడుతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- వెన్నుముక సర్జరీల్లో ఆధునిక వైద్య పద్ధతులు

వెన్నుముక సమస్యపై అశ్రద్ధ చేయవద్దు



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల వెన్నుముక సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులూ అధిక బరువు బ్యాగులను మోయడంతో వెన్ను సమస్యల బారిన పడుతున్నారు. కళాశాల యువత తరగతి గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక వెన్నుముక సమస్యతో వైద్యులను సంప్రదిస్తున్నారు. వెన్నుముక ఆపరేషన్‌ల గురించి వైద్య విధానాల గురించి ప్రజల్లో అనేక అపోహలు ఉండటం, అవగాహన లేకపోవడంతో వెన్ను సమస్యలను పెద్దవి చేసుకుని చివరి దశలో వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

వెన్నుముక ప్రాధాన్యం ఇలా...

ఎముకలన్నింటిలో ముఖ్యమైంది వెన్నుముక. వెన్నుపాముకు రక్షణ కల్పిస్తుంది. వెన్నుముక నుంచే నరాలు బయటకు వస్తాయి. వెన్నుముక మనం నిటారుగా నిలబడటానికి, పక్కకు, వెనుకకు, ముందుకు తిరగడానికి ఎటుకావాలంటే అటు వంగడానికి ఉపయోగపడుతోంది. శరీరం మొత్తాన్ని నిటారుగా నిలబెడుతోంది. వెన్నుపూసలు ఒక దానికొకటి క్రమపద్ధతిలో అమరి వెన్నుముకను ఏర్పరుస్తాయి. కండరాలు లిగమెంట్లతో వెన్నుముక నిర్మాణం జరుగుతోంది. కండరాలు, లిగమెంట్లు, ఆరోగ్యంగా రెండు వైపులా ఒకేరకమైన బిగువుతో ఉంటే వెన్ను పూస దాని స్థానంలో నిలిచి ఉంటుంది. వెన్నుపూసలు వాటి స్థానంలో సక్రమంగా నిలిచి ఉండాలంటే పటుత్వం బాగుండాలి. కండరాలకు వెన్నుపూస ఎముకల మధ్య సమతూకం దెబ్బతింటే నడుము నొప్పివస్తుంది.

సమస్యలకు కారణాలు...

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒకరోజు వెన్నునొప్పితో బాధపడటం జరుగుతుంది. ఎక్కువసేపు కంప్యూటర్‌ల ముందు కూర్చుని పనిచేయటం, స్మార్ట్‌ఫోన్‌లు వినియోగిస్తూ ఎక్కువసేపు ఒకేచోట కూర్చుండిపోవటం, ఊబకాయం, శారీరక శ్రమలేకపోవటం, జీవనశైలిలో మార్పులు, ధూమపానం, కార్లు, ద్విచక్రవాహలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయటం, గుంతలు ఉన్న రోడ్లపై వాహనాలు నడపటం, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారిలో వెన్నుముక సమస్యలు వస్తున్నాయి.

సహజ అరుగుదల..

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్కులు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. గ్యాప్ ఏర్పడిన సమయంలో కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలు జాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మల, మూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. డిస్క్ జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్లల్లో స్పర్శ తగ్గిపోతోంది. వెన్నుపూస ఆకారం మారిపోతోంది.

90శాతం అవే తగ్గిపోతాయి

వెన్నుముకలో డిస్క్ సమస్యలు వచ్చిన మొదటి సారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి డిస్క్ సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటలపాటు నడుముకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడినీళ్ళు కాపడం, ఫిజియోథెరపీ, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50 శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్క్ సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. వీటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

బాధితులు అధికమే...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 300 మంది ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 60 మంది వెన్నుముక సంబంధిత సమస్యలతో బాధపడేవారే. గుంటూరు జిల్లాలో 200 మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 20 మంది వరకు వెన్నుముక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు.

ఇవన్నీ అపోహలే ....

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మళ్లీ సర్జరీ చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే.

గుంటూరు బ్రాడీపేటకు చెందిన రాజేష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఎక్కువ సమయం కుర్చీలో కూర్చుని కంప్యూటర్‌తో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా వెన్నునొప్పి సమస్య ఉన్నా పట్టించుకోలేదు. నొప్పి తీవ్రత పెరిగిపోవటంతో స్పయిన్ సర్జన్స్‌ను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు చేసి వృత్తిలో భాగంగా ఎక్కువ సమయం కూర్చోవటం, వ్యాయామం లేకపోవటం, ఒత్తిడి వల్ల వెన్ను సమస్య తలెత్తినట్లు నిర్ధారించి సర్జరీ చేసి నొప్పి నుంచి విముక్తి కల్పించారు. కోత, కుట్లు లేని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్ చేశారు.

ఆధునిక టెక్నాలజీతో త్వరితగతిన నిర్ధారణ



స్పయిన్ సమస్యలను చాలా సులువుగా గుర్తించి రోగి త్వరగా కోలుకునేలా ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఎలాంటి కోత, కుట్లు లేని ఆపరేషన్లు అందుబాటులోకి రావటంతో రెండు రోజుల్లోనే ఆస్పత్రి నుండి రోగి డిశ్చార్జి అవ్వొచ్చు. నడుము, మెడ, వెన్నుముక సమస్యలను నిర్ధారించేందుకు సాధారణ ఎమ్మారై ద్వారా రోగిని పడుకోబెట్టి స్కాన్ చేస్తారు. తద్వారా కొన్ని సార్లు వ్యాధి నిర్ధారణ పూర్తిగా జరగదు. నేడు స్టాండింగ్ ఎమ్మారై ద్వారా నూటికి నూరు శాతం వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. కంప్యూటర్ న్యావిగేషన్, న్యూరోమానిటరింగ్, మైక్రోస్కోప్ ఆపరేషన్లతో వెన్నుముక సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, స్పయిన్‌సర్జన్, గుంటూరు

త్యాగరాజ కీర్తనల అలాపనతో పురవీధుల్లో శోభాయాత్ర



కీర్తనల అలాపన

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీ త్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం నిర్వహిస్తున్న సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు శనివారం మూడో రోజుకి చేరాయి. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీకాంత్ బృందం మంగళవాద్యంతో ప్రారంభించారు. త్యాగరాజ స్వామిని సంగీత కళాకారులు ఆకర్షణీయంగా అలంకరించారు. ద్విభాషా హరికథకులు తుర్లపాటి శంభ యాచారి భాగవతార్ త్యాగరాజస్వామి వేషధారణలో పురవీధుల్లో త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తూ శోభాయాత్ర చేపట్టారు. అనంతరం చెన్నై కళాకారులు, స్థానిక కళాకారులు, వాయిద్య కళాకారులు అందరూ కలిసి పంచరత్న కీర్తనలను ఆలపించారు. మూలవిరాట్ త్యాగరాజస్వామికి విశేషాభిషేకార్చనలు జరిగాయి. సాయంత్రం ప్రధాన కచేరీల్లో మోహన్ సంతానం(చెన్నై) శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. కళాకారులను సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజా శంకర్ పర్యవేక్షణలో సత్కరించారు.

ఎన్‌టీఆర్‌కు నివాళి

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి శనివారం నిర్వహించారు.

స్వచ్ఛ దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న నగర కమిషనర్, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, ఎస్పీ సతీష్‌కుమార్



రోడ్డు శుభ్రం చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: స్వచ్ఛంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం కార్యక్రమంలో భాగంగా నగరంలోని కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ నజీర్, గల్లా మాధవితో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం ఒక థీం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్యాలెండర్‌ను రూపొందించినట్లు వివరించారు. ర్యాలీ కార్యక్రమాలు నగరంలోని 206 సచివాయాల పరిధిలో నిర్వహిస్తున్నామని, సచివాలయాల పరిధిలో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హిందూ కాలేజీ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి, స్వచ్ఛతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రజల జీవన విధానంలో భాగం కావాలి

గుంటూరు మెడికల్: స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో భాగం కావాలని డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. గుంటూరు నగరం అహల్య హాస్పిటల్‌లో స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివస్‌ను శనివారం నిర్వహించారు. డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ మాట్లాడుతూ శుభ్రత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మున్నం సుష్మ, డాక్టర్ సింధూర పాల్గొన్నారు.

బీజేపీ నేతల నిరసన

గుంటూరు మెడికల్: స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకుండా నిర్వహించడంపై శనివారం బీజేపీ నేతలు నిరసన తెలిపారు. స్థానిక ఏటీ అగ్రహారంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి బీజేపీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై మోదీ ఫొటో లేకపోవడాన్ని ప్రశ్నించారు. కార్యక్రమాన్ని బహిష్కరించారు.

వైద్య పరిశోధనలపై అవగాహన సదస్సు



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో శనివారం ఫార్మకాలజీ (ఔషధ శాస్త్రం) వైద్య విభాగంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వైద్య పరిశోధనలు ఎలా మొదలు పెట్టాలనే అంశంపై సదస్సు నిర్వహించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి న్యూరాలజీ వైద్య విభాగంలో ప్రొఫెసర్‌గా తన పరిశోధన అనుభవాలు, సూచనలను వివరించారు. ఆస్ట్రేలియా గ్రీఫిత్ యూనివర్సిటీ వాతావరణ శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్న డాక్టర్ సుందరాచారి తనయుడు వి.సాయిశరత్‌చంద్ర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని వైద్య పరిశోధనలు ఏవిధంగా చేయాలనే అంశాలపై వైద్య విద్యార్థులకు వివరించారు.

కరోనాతో మృతి చెందిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్ బాషా, ఏపీఎన్జీ సంఘ నాయకులు

గుంటూరు మెడికల్: కరోనా సమయములో మృతి చెందిన ఉపాధ్యాయుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. 2020లో కరోనా బారిన పడి చనిపోయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పిల్లలకు నేటి వరకు ఉద్యోగ, ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. కారుణ్య నియామకాలు కింద పంచాయతీ రాజ్ శాఖలో ఎక్కువ మంది ఉండడం వలన అక్కడ ఉద్యోగుల ఖాళీలు లేకపోవడం వలన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 110 నుంచి 150 మంది వరకు ఉపాధ్యాయుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు లేక వారి కుటుంబ సభ్యుల జీవితాలు చాలా దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానిక సంస్థల లోనే ఉద్యోగం కలిప్ంచాలని నిబంధనలు, ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఉత్తర్వులను వన్ టైం సెటిల్మెంట్ కింద సడలించి, కారుణ్య నియామకాల కింద నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషా ఖాదిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నగరశాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఇక లేనట్లే ....

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా తీపికబురు చెప్పిందని బీజేపీ నాయకుడు పాలపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఇటీవల కేంద్రం ప్రకటించిన విధంగానే ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్యాకేజీలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు రివైవల్ ప్యాకేజీను ప్రకటించిందని చెప్పారు.

శంకరవిలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభం



నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

నెహ్రూ నగర్: నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మించేందుకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరపున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు శనివారం నుంచి ప్రారంభించినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. 14 ప్రభుత్వ భవనాలకు, 21 మిషనరీ ఆస్తులకు రోడ్డు విస్తరణకు గాను నోటీసులు అందజేశామన్నారు.

ప్రైవేట్ భవన యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారన్నారు. విస్తరణలో వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని వివరించారు. తొలుత నగర పాలక సంస్థ రోడ్డు విస్తరణ క్రమంలో భవన తొలగింపు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించిందని, అంగీకార పత్రాలు అందించిన బిల్డింగ్ నంబర్ 119, క్లాస్ 4 ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలూకు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న ఆరు షాపులు ఫస్ట్ ఫ్లోర్లను అసోసియేషన్ భవనం విస్తరణలో కోల్పోతున్న క్రమంలో శనివారం జీఎంసీ ఆధ్వర్యంలో కూల్చివేత పనులు ప్రారంభించారు. ఆర్ఓబీ నిర్మాణం కోసం ఈ రోడ్డు విస్తరణ పనులు నిరంతరంగా జరుగుతాయని, విస్తరణలో మార్కింగ్ ప్రకారం వారి ఆస్తి విలువను బట్టి భవన యజమానులకు కోల్పోయిన భవనాల కింద నష్టపరిహారం, స్థలం విలువనకు 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను అందజేయుట జరుగుతుందని వెల్లడించారు.

నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్



ట్రాఫిక్ వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్

పట్నంబజారు: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం గుంటూరు నగరంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా నెహ్రూ యువ కేంద్ర ద్వారా జిల్లా ట్రాఫిక్ వలంటీర్లు పేరుతో ఆసక్తి కలిగిన 25 మంది యువతను ఎంపిక చేసి వారికి రహదారి భద్రత నియమాల గురించి అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బి.గోపాల్, సౌజన్య, గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, తదితరులు గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గుజ్జనగుండ్లలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ ఆధ్వర్యంలో మున్సిపల్ ట్రావెలర్ బంగ్లా సెంటర్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్సు, హెల్మెట్, వాహన ధ్రువీకరణ పత్రాలు, వాహనాలు నిలువరించి జరిమానాలు విధించారు. 20 చలానాలకు సంబంధించి రూ. 21వేలు, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనదారులు 20 మందికి రూ. 20 వేలు జరిమానా, అధిక లోడు ఉన్న వాహనాలకు సంబంధించి రూ. 20 వేలు జరిమానాలు విధించారు. జిల్లా ట్రాఫిక్ వలంటీర్లకు గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలకు ఏవిధంగా ట్రాఫిక్ అంశాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు.

రీ సర్వే పైలట్ గ్రామంగా అనుమర్లపూడి



పెదకాకాని: మండలంలో అనుమర్లపూడి గ్రామాన్ని రి సర్వే పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ కృష్ణకాంత్ తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, హద్దులను నిర్ణయిస్తున్నారని చెప్పారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రైవేట్ వ్యవసాయ భూములు ప్రతి ఒక్క రైతుకి నోటీసు ద్వారా టామ్ టామ్ ద్వారా తెలియజేసి కొలతలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అనుమర్లపూడి గ్రామ రీ సర్వే పూర్తయిన వెంటనే రీ సర్వే జరుగుతుందని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనం చోరీపై నగరంపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేటకు చెందిన కొమ్మాలపాటి నిషిత్, ఈనెల 5వ తేదీన రమేష్ ఆస్పత్రిలో బంధువులను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి పార్కింగ్ చేసి ఆస్పత్రిలోకి వెళ్లాడు. కొంత సేపటికి బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల రైల్వే స్టేషన్, బస్టాండ్, పరిసర ప్రాంతాలలో వెతుకలాడిన వాహనం కనిపించలేదు. దీంతో శనివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

వామపక్ష పార్టీల నిరసన



శంకర్‌విలాస్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

లక్ష్మీపురం: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో గత పార్లమెంటు సమావేశాల్లో అంబేడ్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని, గో బ్యాక్ అమిత్ షా అంటూ శంకర్ విలాస్ సెంటర్‌లో శనివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీపీఐ ఎంఎల్, ప్రజాపోరు నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించటమేనని అన్నారు. ఈ వ్యాఖ్యలు అమిత్ షా అహంకార వైఖరిని తెలియజేస్తుందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, సీపీఎం జిల్లా నాయకులు ఎల్.అరుణ, ఎంఎ చిష్తీ, వామపక్షాల నాయకులు బి.సత్యనారాయణ, షేక్ ఖాశిం వలి, షేక్ బాషా, షేక్ ఖాశిం షహీద్, రాధాకృష్ణమూర్తి అంజి, సురేష్, హనుమంతరావు, అరుణ్ పాల్గొన్నారు.

ఇద్దరికి ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారాలు ప్రదానం



ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం ప్రదానం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాల్లో భాగంగా శనివారం ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. సభకు పరిషత్ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. అతిథులుగా విద్యా సంస్థల డైరెక్టర్ పీవీ శంకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంస్థ సభ్యులు వేములపల్లి విఠల్, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి. మల్లికార్జునరావు హాజరవ్వగా, కమిటి వైస్ చైర్మన్ కాట్రగడ్డ ప్రసాద్, కన్వీనర్ అట్లూరి నారాయణరావులను ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. సభానంతరం సహృదయ ద్రోణాదుల వారు అద్దేపల్లి భరత్‌కుమార్ రచనకు, డి.మహేంద్ర దర్శకత్వం వహించిన వర్క్ ఫ్రం హోం నాటికను ప్రదర్శించగా, సభికులను, ప్రేక్షకులను ఆకట్టుకుంది.